సాక్షి తిరుపతి

ఆదివారం । 5 । నవంబర్ । 2023



విను వీధిలో విహరిద్దాం

అత్యాధునిక సాంకేతికతతో అంతరిక్షనౌకపై గగనవీధిలో విహరిద్దామని ఇస్రో శాస్త్రవేత్తలు యువతకు పిలుపునిచ్చారు. - 8లో



విజయవంతంగా వైద్యవిద్య

స్విమ్స్‌లో నిరంతర వైద్యవిద్య కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వీసీ డాక్టర్ ఆర్‌వీ కుమార్ తెలిపారు. - 8లో



కులగణన చరిత్రాత్మకం

రాష్ట్రంలో కులగణనపై సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్ణయం చరిత్రాత్మకమని బీసీ సంఘం నేతలు చెప్పారు. - 8లో

న్యూస్‌రీల్

సాగుకు గంగనీటిని ఇవ్వలేం



వెంకటరమణ

తిరుపతి అర్బన్: ఈ రబీ సీజన్‌లో తెలుగు గంగ నీటిని సాగుకు వదలడం వీలుకాదని జలవనరులశాఖ చీఫ్ ఇంజనీర్ వెంకటరమణ స్పష్టం చేశారు. ఆయన తిరుపతిలోని తమ చాంబర్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ 62 టీఎంసీల సామర్థ్యం కల్గిన కండలేరు జలాశయంలో ప్రస్తుతం 11.5 టీఎంసీల నీరు మాత్రమే ఉందని చెప్పారు. ఇందులో 7.5 టీఎంసీల నీరును నిల్వ ఉంచాల్సి ఉందని వెల్లడించారు. మిగిలిన 3 టీఎంసీల నీటిని తాగడానికి వినియోగించాల్సి వస్తుందని వెల్లడించారు. దీంతో రబీ సీజన్‌కు సాగునీటిని ఇచ్చే పరిస్థితి లేదని చెప్పారు. రైతులు ఈ విషయాన్ని గుర్తుంచుకుని సాగు చేయాలని పేర్కొన్నారు. తెలుగుగంగకాలువ నీటి ఆధారంగా వరి నార్లు పోయరాదని సూచించారు. అయితే ఈ నెల 20వ తేదీలోపు భారీ వర్షాలు కురిసి కండలేరు జలాశయానికి నీరు వస్తే తరువాత వివరిస్తామని చెప్పారు. తగినంత నీరు ఉంటే ఎప్పుడు లేనివిధంగా వరుసగా నాలుగేళ్ల పాటు రబీతోపాటు ఖరీఫ్ సీజన్‌కు నీరు ఇచ్చామని చెప్పారు. రబీలో 1.2లక్షల ఎకరాలకు, ఖరీఫ్‌లో 80 వేల ఎకరాలకు మొత్తంగా ఏడాదిలో గంగ నీటిని 2లక్షల ఎకరాలకు అందించామని తెలియజేశారు. మరో వైపు ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులు త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. అరణియార్ ప్రాజెక్టుకు సంబంధించిన పనులు జోరుగా సాగుతున్నాయని వివరించారు.

ఎయిర్‌పోర్ట్ అడ్వైజరీ కమిటీ సభ్యునిగా పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి



రేణిగుంట: తిరుపతి విమానాశ్రయం అడ్వైజరీ కమిటీ సభ్యునిగా మండలంలోని గాజులమండ్యంకు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి (శేష శయన రెడ్డి) నియమితులయ్యారు. తిరుపతి విమానాశ్రయ అడ్వైజరీ కమిటీ చైర్మన్ హోదాలో ఎంపీ మద్దెల గురుమూర్తి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సిఫార్సు మేరకు ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ బసవరాజు అడ్వైజరీ కమిటీ సభ్యునిగా శ్రీధర్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అటవీ భూములకు పట్టాలు ఇవ్వం



తహసీల్దారుతో చర్చిస్తున్న రేంజర్ రవీంద్రబాబు

కలువాయి: రిజర్వు ఫారెస్ట్, అటవీ రెవెన్యూ పోరంబోకు భూములకు పట్టాలు ఇవ్వబోమని రాపూరు అటవీ రేంజ్ అధికారి రవీంద్రబాబు స్పష్టం చేశారు. కలువాయి రెవెన్యూ కార్యాలయానికి శనివారం వచ్చిన ఆయన తహసీల్దారు స్వర్ణతో చర్చించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో రిజర్వు ఫారెస్ట్, అటవీ పోరంబోకు భూములకు పట్టాలు ఇవ్వాలని పలు వినతులు వచ్చిన నేపథ్యంలో ఈ విషయమై వారు చర్చలు జరిపారు. అటవీ భూములను సాగు చేసేందుకు పట్టాలు ఇవ్వబోమని, అటవీ రెవెన్యూ పోరంబోకు భూముల్లోనే రెవెన్యూ శాఖ అడవులు పెంచాల్సి ఉంటుందని అన్నారు. ఆయన వెంట డీఆర్వో బాలాజీ, సిబ్బంది జనార్ధన్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

అయోమయం.. గందరగోళం



- తిరుపతి, చిత్తూరు నుంచి పోటీ చేస్తామంటున్న జనసేన
- అభ్యర్థి లేరు.. చిత్తూరులో పోటీచేసుకోండి అంటున్న టీడీపీ
- శ్రీకాళహస్తిలో బీజేపీ, జనసేన, టీడీపీ మూడుముక్కలాట
- బలం లేకపోయినా ఎవరికి వారు ప్రచారం చేసుకుంటున్న వైనం

సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగు దేశం పార్టీ, జనసేన గందరగోళంలో పడ్డాయి. ప్రజాబలం లేకపోవడం, మరో వైపు అభ్యర్థుల కొరత ఆ రెండు పార్టీలను పట్టిపీడిస్తున్నాయి. నోటాకు వచ్చే ఓట్లు కూడా రాని బీజేపీ శ్రీకాళహస్తిపై ఆశలు పెట్టుకుంది. టీడీపీ–జనసేన పొత్తు ఉంటుందని పవన్ కల్యాణ్ ప్రకటించడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆ రెండు పార్టీల శ్రేణులు అధికారంలోకి వచ్చేసినట్లు ఎవరికి వారు సీట్లు ప్రకటించుకుంటున్నారు. అందులో భాగంగా తిరుపతి నుంచి జనసేన అభ్యర్థి తామేనంటూ పసుపులేటి హరిప్రసాద్, మరో వైపు కిరణ్‌రాయల్ ప్రకటించుకుంటున్నారు. లేదు లేదు తామే పోటీలో ఉన్నామంటూ టీడీపీ చెప్పుకుంటోంది. ఈ పరిస్థితుల్లో టీడీపీ, జనసేనకు చెందిన కొందరు ఓ ఒప్పందానికి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. పవన్ లేదా నాగబాబు పోటీ చేస్తే తాము తిరుపతి టికెట్‌ని త్యాగం చేస్తామని కొందరు టీడీపీ శ్రేణులు హామీ ఇచ్చినట్లు తెలిసింది. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్ వర్గీయులు మాత్రం ససేమిరా అంటున్నారు. ఇన్నేళ్లు పార్టీని నమ్ముకుని, పార్టీ కోసం కష్టపడుతుంటే, పొత్తంటూ వచ్చి తిరుపతి టికెట్ తన్నుకెళ్తామంటే ఒప్పుకునేది లేదని భీష్మించుకున్నారు. వీరిద్దరూ కాకుండా మరో ఇద్దరు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది.

చిత్తూరు తీసుకోండి

చిత్తూరులో టీడీపీని నమ్ముకుని ఉన్న మాజీ మేయర్ కఠారి హేమలత, గీర్వాణి చంద్రప్రకాష్‌ను ప్రస్తావించకుండా ఆ పార్టీ అధినాయకులు జనసేనకు ఆఫర్ ఇచ్చారు. చిత్తూరులో బలమైన అభ్యర్థులు లేరని, కావాలంటే జనసేన నుంచి ఎవరైనా పోటీచేస్తే తాము మద్దతు ఇస్తామని టీడీపీ అధినాయకత్వం చెప్పినట్లు సమాచారం. అయితే టీడీపీలోని కొందరు తమను సంప్రదించకుండా జనసేనకు ఎలా మాట ఇస్తారని తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలిసింది. అధిష్టానం ఏదైనా ఆదేశిస్తే ముందుండి చేసేది మేమైతే.. పొత్తంటూ జనసేనకు ఇవ్వడం ఎంత వరకు న్యాయం అని ఆ వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. అభ్యర్థులు, ప్రజాబలం లేని జనసేన పార్టీ గంగాధరనెల్లూరు, సత్యవేడు నుంచి కూడా పోటీ చేయనున్నట్లు ప్రకటించుకుంటున్నారు. ఎవరినీ సంప్రదించకుండా జనసేన వారు లేని పోని ప్రచారాలు చేస్తూ గందరగోళానికి గురిచేస్తున్నారంటూ టీడీపీ నేతలు మండిపడుతున్నారు

శ్రీకాళహస్తిలో మూడు ముక్కలాట

నోటాకు వచ్చే ఓట్లు కూడా రాని బీజేపీ శ్రీకాళహస్తి నుంచి పోటీ చేయాలని స్థానిక నాయకులు భావిస్తున్నారు. అందులో భాగంగా తానే అభ్యర్థి అని కోలా ఆనంద్ చెప్పుకుంటున్నారు. తాము పోటీ చేస్తాను కాబట్టి జనసేన శ్రేణులు తమకే మద్దతు ఇవ్వాలని కమలనాథులు కోరుతున్నారు. అదెలా కుదురుతుంది, తామే పోటీచేస్తామంటూ జనసేన అంటోంది. ఈ రెండు పార్టీలు ఇలా ఉంటే, పొత్తులో భాగంగా జనసేన టీడీపీకి మద్దతు ఇస్తుందని బొజ్జల సుధీర్‌రెడ్డి, మరో వైపు ఎస్సీవీ నాయుడు ప్రచారం చేసుకుంటున్నారు. బీజేపీతో పొత్తు ఉన్నా లేకపోయినా, శ్రీకాళహస్తి కమలనాథులు తమకే మద్దతు ఇస్తారని చెప్పడం గమనార్హం. తెలంగాణాలో బీజేపీ జనసేన పొత్తు పెట్టుకుంటే, ఏపీలో జనసేన టీడీపీతో పొత్తు ఉంటుందని ప్రకటించింది. టీడీపీ మాత్రం ఎన్నికల బరి నుంచి తప్పుకుని కాంగ్రెస్‌కు మేలు చేసేందుకు పరోక్షంగా మద్దతు ఇస్తోంది. 2019 ఎన్నికల్లో ఒకే సీటుతో సరిపెట్టుకున్న టీడీపీ, ఉనికే లేని జనసేన, నోటా ఓట్లు కూడా రాని బీజేపీ ఎవరికి వారు తాము పోటీ చేస్తున్నాం అంటూ ప్రచారం చేసుకుంటుంటే జనం నవ్వుకుంటున్నారు. అధికారం కోసం ఇంతగా దిగజారటం ఏంటో ఇటు ఓటర్లూ, అటూ రాజకీయ పార్టీలు అయోమయంలో మునిగిపోయారు.

కల్యాణ వెంకన్న సేవలో లోకాయుక్త చీఫ్ జస్టిస్



కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి సేవలో లోకాయుక్త చీఫ్ జస్టిస్ లక్ష్మణరెడ్డి

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారిని శనివారం లోకాయుక్త చీఫ్ జస్టిస్ లక్ష్మణరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని స్వామివారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, జమేదారు చిరంజీవి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీయూలో మలివిడత పీజీ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ పీజీ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు రెండవ విడత ద్వారా అడ్మిషన్లు పొందేందుకు అవకాశం కల్పించినట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య శ్రీమురళి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదాయ పరిమితులకు లోబడి వర్సిటీలో ఆర్ట్స్, సైన్స్, కామర్స్ కళాశాల ఆధ్వర్యంలో ఉండే రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లను ఈ నెల 6వ తేదీ నుంచి భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఈ సీట్లలో అడ్మిషన్ పొందే అభ్యర్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ వర్తించదని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రయాణికులతో గౌరవంగా మెలగండి



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీటీవో చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ఆధ్యాత్మిక నగరమైన తిరుపతికి వచ్చే ప్రయాణికులతో గౌరవంగా వ్యవహరించాలని డీపీటీవో చెంగల్‌రెడ్డి తెలిపారు. తిరుపతి డీపీటీవో కార్యాలయంలో శనివారం ఆర్టీసీ నిఘా అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. డీపీటీవో మాట్లాడుతూ యాత్రికులతో దురుసుగా ప్రవర్తిసే చర్యలు తప్పవని హెచ్చరించారు. బస్‌స్టేషన్‌లో వస్తువులను ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని స్పష్టం చేశారు. ఆర్టీసీ అంటే సురక్షిత ప్రయాణంతోపాటు గౌరవమర్యాదలు ఉంటాయన్న పేరు వచ్చేలా ఉద్యోగులు వ్యవహరించాలని చెప్పారు. బస్టాండ్లతోపాటు ఆర్టీసీ ప్రాంగణంలో నిఘా పెంచాలని సూచించారు. కార్గో సేవలను విస్తృతం చేయాలని సూచించారు. కోవిడ్ సమయంలో ఆర్టీసీ రెండేళ్లపాటు భారీగా నష్టపోయిన విషయాన్ని గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వం ఆర్టీసీకి అండగా నిలిచి, విలీనం చేయడంతో ఆర్టీసీ కార్మికులు ఉద్యోగులు అయ్యారని చెప్పారు. అక్టోబర్ 30న ప్రారంభమైన ఈ వారోత్సవాలు నవంబర్ 5వ తేదీ వరకు కొనసాగుతాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్, మెకానిక్ ఇంజనీర్ నరసింహులు, పర్సనల్ ఆఫీసర్ పార్థసారథి, తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

7న ఉద్యోగ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుచానూరు రోడ్డు, పద్మావతిపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో ఈ నెల 7వ తేదీ ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఉప ఉపాధి అధికారి ఎస్.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా రిలయన్స్ నిపాన్ లైఫ్ ఇన్స్యూరెన్స్ సంస్థలో లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా తిరుపతిలో ఉద్యోగం చేసేందుకు ఏదేని డిగ్రీ పూర్తి చేసిన 30 నుంచి 40 ఏళ్ల లోపు ఉన్న స్త్రీలు అర్హులని తెలిపారు. అపోలో ఫార్మసీలో రిటైల్ ట్రైనీ, అసోసియేట్/ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు 18నుంచి 30ఏళ్లలోపు వయసు కలిగి పది, ఇంటర్, డిగ్రీ, ఎం ఫార్మ్, బీఫార్మ్, డిఫార్మ్ చేసినవారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 99638 35858, 6369429950ను సంప్రదించాలని తెలిపారు. ''డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎన్‌సీఎస్.ఇన్'' అనే వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

జర్నలిస్టుల కల సాకారం చేసిన జగన్

- ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం
- తిరుపతిలో ముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకాలు



తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జర్నలిస్ట్ సంఘ నేతలు, జర్నలిస్టులు

తిరుపతి కల్చరల్: జర్నలిస్టుల కల సాకారం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తిరుపతి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బాలచంద్ర, జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కల్లుపల్లి సురేందర్‌రెడ్డి తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ ప్రాంగణంలో వివిధ జర్నలిస్టు సంఘాల నేతల ఆధ్వర్యంలో శనివారం సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కృతజ్ఞతలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ 15 ఏళ్ల తర్వాత జర్నలిస్టుల కల సాకారం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. 2008లో అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఆ తరువాత ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ చారిత్రక నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జాప్ నేతలు విజయ్, జర్నలిస్ట్ నేతలు సునీల్, కుమార్, గాంధీ, మోహన్‌రావు, మహేష్, తిరుపాల్, రాజు, జర్నలిస్టులు సుబ్బు, భూమిరెడ్డి నరేష్, శశి, మోహన్‌క్రిష్ణ, వేణు, మూర్తి, హరి, చంద్రగౌడ్, ప్రవీణ్, ప్రసాద్, లోకనాథ్‌రెడ్డి, పీటర్, పద్మనాభం, సుధీర్, కృష్ణమూర్తి, శ్రీనివాసాచారి, స్మార్ట్ బుజ్జి, మురళి, ప్రశాంత్ పాల్గొన్నారు.

రాస్ భవన్‌లో..



రాస్ భవన్‌లో క్షీరాభిషేకం చేస్తున్న మేయర్ శిరీష

జర్నలిస్టులు ఏళ్ల తరబడి ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న సొంతింటి కల సాకారం చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి జర్నలిస్టులందరూ బాసటగా నిలవాలని మేయర్ డాక్టర్ శిరీష పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాస్ భవన్‌లో శనివారం ఫెడరేషన్ 17వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి ఫెడరేషన్ నేతలు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కార్యదర్శి శ్రీధర్, పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి

- బడిబయట పిల్లలు బడిలో ఉండాలి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతూ బాల్యవివాహాలు జరిగిన తర్వాత హంగామా చేయకుండా ముందే అడ్డకట్ట వేసి, వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. మరోవైపు బడి బయట పిల్లలు బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణులు ఆస్పత్రుల్లోనే ప్రసవం పొందేలా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంపొందించాలని తెలిపారు. బాలింతలు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు వినియోగించుకోవాలని చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలల్లో ఆరోగ్యశ్రీ సేవలపై మరింత అవగాహన కల్పించాలని వైద్య అధికారులను ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కింద గుర్తించిన కంటి శుక్లాల రెఫరల్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి శస్త్ర చికిత్స నిర్వహించాలని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి డిసెంబర్ 1న పంపిణీ చేయనున్నట్లు వివరించారు. రక్త హీనతకు నివారణ దిశగా వైద్యసేవలు అందిస్తూ పౌష్టికాహారం, ఐరన్ టాబ్లెట్స్ పంపిణీ చేయాలని చెప్పారు. జిల్లాలో వర్షాకాలం ఆరంభమైన నేపథ్యంలో మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించి వైద్య శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. పదవ తరగతి, ఇంటర్ పరీక్షలు తప్పిన విద్యార్థులకు అవగాహన కల్పించి సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేలా చూడాలని చెప్పారు. పీఎం విశ్వకర్మ యోజన పథకానికి సంబంధించి లబ్ధిదారులను గుర్తించి నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో శేఖర్, జిల్లా గ్రామ, వార్డు సచివాలయం అధికారిణి సుశీలాదేవి, సీపీఓ ప్రేమచంద్రా రెడ్డి, ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయకర్త రాజశేఖర్ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ ఆఫీసర్ తేజస్విని, డీఎల్‌డీవోలు ఆదిశేషారెడ్డి, వాణి తదితర అధికారులు పాల్గొన్నారు.

డీవీ సత్రంలో భారీ వర్షం



డీవీ సత్రంలో కమ్ముకున్న కారు మబ్బులు

దొరవారిసత్రం: మండల పరిధిలో శనివారం భారీ వర్షం సుమారు అర్ధగంట పాటు కురిసింది. ఒక్కసారి ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులతో వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో ఎండుముఖం పట్టిన వరి, వేరుశనగ పంటలకు ఊపిరి వచ్చింది.

రెవెన్యూ మంత్రికి జ్ఞాపిక బహూకరణ



మంత్రి ధర్మాన ప్రసాద్‌రావుకు జ్ఞాపికను అందిస్తున్న ఆర్‌డీవోలు

రేణిగుంట: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాద్‌రావుకు శనివారం రేణిగుంట విమానాశ్రయంలో తిరుపతి, శ్రీ కాళహస్తి ఆర్‌డీవోలు నిశాంత్‌రెడ్డి, రవి శంకర్‌రెడ్డి జ్ఞాపికను అందజేశారు. తిరుమల దర్శనానంతరం తిరుగుపయనమైన ఆయనకు వీరు విమానాశ్రయంలో జ్ఞాపికను అందించి సాదర వీడ్కోలు పలికారు.

విజయవంతంగా నిరంతర వైద్య విద్య

తిరుపతి కల్చరల్: స్విమ్స్ న్యూక్లియర్ మెడిసిన్, రేడియాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం శ్రీపద్మావతి ఆడిటోరియంలో నిరంతర వైద్యవిద్య కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. దీన్ని స్విమ్స్ ఉపకులపతి డాక్టర్ ఆర్‌వీ. కుమార్, స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్విమ్స్ ఉపకులపతి డాక్టర్ ఆర్‌వీ.కుమార్ మాట్లాడుతూ సీఎంఈ కార్యక్రమాల ద్వారా ప్రపంచంలో వస్తున్న ఆధునిక వైద్య విజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు ఇది మంచి వేదికకానుందన్నారు. అనంతరం రేడియాలజీ సీనియర్ రెసిడెంట్ డాక్టర్ డీసీ.సంజయ్ సీటీ- కరోనరీ ఆంజియోగ్రఫీ అనే అంశంపై ప్రసంగించారు. న్యూక్లియర్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డీఎస్.హేమలత, ప్రొఫెసర్ డాక్టర్ రమ్య తదితరులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వైద్య విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషా కళావత్, న్యూక్లియర్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ టీసీ.కళావత్, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి దేవి, కార్డియాలజీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వనజాక్షమ్మ, పీజీ వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

విను వీధిలో విహరిద్దాం

- అంతరిక్ష పరిశోధనలపై అవగాహన అవసరం
- చంద్రయాన్ స్ఫూర్తితో ముందుకెళదాం
- యువతకు ఇస్రో శాస్త్రవేత్తల పిలుపు

తిరుపతి సిటీ/ఏర్పేడు: అంతరిక్ష నౌకపై వినువీధిలో విహరిద్దాం తరలిరండి అంటూ ఇస్రో శాస్త్రవేత్తలు యువతకు పిలుపునిచ్చారు. ఏర్పేడు మండలం ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో శనివారం ప్రత్యేకంగా 'ఆకాష్ అనంత అవకాశాలు' అనే సదస్సు నిర్వహించారు. దీనికి చంద్రయాన్-3 శాస్త్రవేత్తలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. అనంతరం సుమారు గంటపాటు ఇస్రో శాస్త్రవేత్తలు విద్యార్థులతో మమేకమయ్యారు. వారి ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ, వారి సందేహాలను నివృత్తి చేస్తూ అంతరిక్ష పరిశోధనల ప్రాధాన్యతను, ఆవశ్యకతను వివరించారు. ఈ ప్రపంచం మొత్తం భారత్ వైపు చూడాలంటే ఆకాశవీధిలో విజయవంతంగా విహరించాలని సూచించారు. అందుకోసం నేటి విద్యార్థులు, యువతరం అంతరిక్ష పరిశోధనలపై దృష్టి సారించాలని చెప్పారు. చంద్రయాన్ విజయం యావత్ భారదేశ ప్రజలదేనని పేర్కొన్నారు. ఈ మిషన్‌లో పనిచేసిన ప్రతి శాస్త్రవేత్త రోజూ 12 గంటలు శ్రమించారని వివరించారు. రాబోయే తరంలో మరిన్ని అంతరిక్ష నౌకలను తయారు చేయాల్సిన బాధ్యత ప్రస్తుత యువతదేనన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో సాధించిన విజయాలే నేడు భారత్‌ను ప్రపంచ దేశాల ముందు హీరోగా నిలిపాయని గుర్తుచేశారు. ఆదిత్య-ఎల్1 సోలార్ వ్యవస్థపై పరిశోధనలు చేయనున్నట్లు వివరించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, మానవాళికి ఉపయోగపడే ఉపగ్రహాలను అందుబాటులోకి తీసుకోవాలని కోరారు. ప్రపంచం విస్తుపోయేలా గగనతలంలో భారత దేశం జైత్రయాత్ర సాగించాలని, ఆ దిశగా నేటి యువత ముందుకెళ్లాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఏ దేశానికీ తీసిపోని విధంగా మన అంతరిక్ష ప్రయాణం సాగిందన్నారు. ఇకముందు ఏ దేశమూ మనల్ని అందుకోలేని స్థాయిలో మనజెండా అంతరిక్షంలో రెపరెపలాడాలని చెప్పారు. అనంతరం ఈ సదస్సులో పాల్గొన్న ముఖ్య అతిథులకు ఐఐటీ యాజమాన్యం జ్ఞాపికలతో సత్కరించింది. ఇందులో ప్రధానంగా చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1 మిషన్ డైరెక్టర్ శ్రీకాంత్, డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ భరత్‌కుమార్, ఇస్రో శాస్త్రవేత్త రత్నకుమార్, డాక్టర్ శంకర సుబ్రమణియన్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లాలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు హాజరయ్యారు.



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న చంద్రయాన్-3 శాస్త్రవేత్తలు

ప్రత్యక్షంగా చూశాం



చంద్రయాన్-3 ప్రయోగాన్ని ఏ విధంగా ప్రయోగించారో, ఎలా రోవర్ ల్యాండ్ అయ్యిందనే అంశాలను ఇస్రో శాస్త్రవేత్తలు ప్రత్యక్షంగా మాకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూపారు. ఈ అద్భుత విజయాన్ని శాస్త్రవేత్తల ద్వారా ప్రత్యక్షంగా వినడం సంతోసాన్ని కలిగించింది. ఇప్పుడే మా ఎదుట చంద్రయాన్-3 ప్రయోగం జరిగినట్లుగా శాస్త్రవేత్తలు వివరించడం మమ్ములను మంత్రముగ్ధులను చేసింది. – **కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు, వెంకటగిరి**

మనసు పులకరించింది



చంద్రయాన్-3 ప్రయోగాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు పూర్తి వివరాలతో వీడియో ద్వారా తమకు అందించడంతో మా మనసు పులకరించిపోయింది. మరో సారి ఆ ప్రయోగాన్ని మాకు చూపించారు. మాకున్న ఎన్నో సందేహాలను ప్రత్యక్షంగా ఇస్రో శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకోవడం అదృష్టంగా భావిస్తున్నాం. అంతరిక్ష పరిశోధనలపై పూర్తి అవగాహన కల్పించారు. –**ప్రైవేట్ సైనిక్ స్కూల్ విద్యార్థులు, తిరుపతి**

స్విమ్స్‌లో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

తిరుపతి తుడా: స్విమ్స్ శ్రీ బాలాజి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీలో క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహణ కోసం ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా భర్తీ చేయనున్నట్లు స్విమ్స్ రిజిస్ట్రార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరి పోస్టులకు సంబంధించి కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేసే ఈ పోస్టులకు ఈ నెల 9, 10 తేదీల్లో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామన్నారు.

మహిళా అభ్యర్థుల పోస్టుల వివరాలు

గైనకాలజీ మెడికల్ ఆఫీసర్- 2, రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ - 2, డెంటిస్ట్రీ మెడికల్ ఆఫీసర్ -2,జనరల్ సర్జరీ మెడికల్ ఆఫీసర్ -2, స్టాఫ్ నర్స్- 4, ఏఎన్ఎం- 4, మమోగ్రఫీ టెక్నీషియన్- 2, కార్డియో వాస్క్యులర్ -2 టెక్నీషియన్- 2, డేటా ఎంట్రీ ఆపరేటర్- 2, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్- 2, మెడికల్ సోషియల్ వర్కర్ -2 పోస్టులకు మహిళలను మాత్రమే నియమించనున్నట్లు తెలిపారు.

ఎలక్ట్రీషియన్ -2, డ్రైవర్స్- 2 పోస్టుల్లో పురుషులను మాత్రమే నియమించనున్నట్లు వివరించారు. అన్ని కేటగిరీల పోస్టులకు హిందువులు మాత్రమే అర్హులని తెలియజేశారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకునిరావాలి అని చెప్పారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి టీఏ, డీఏలు చెల్లించేది లేదని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు వెంటనే విధుల్లో చేరాలని, విద్యార్హత, తగిన అనుభవం గల అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. రోస్టర్ ప్రకారం పోస్టులను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు స్విమ్స్ వెబ్సైట్ https://svimstpt. ap.nic.inను సందర్శించవలసిందిగా ఆయన కోరారు.

వైభవం.. లక్ష్మీనరసింహుడి కల్యాణం





స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్య కల్యాణ మండపంలో కొలువుదీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణలతో కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు.

కులగణనపై జగన్ నిర్ణయం చరిత్రాత్మకం

తిరుపతి కల్చరల్: బీసీల సుదీర్ఘ ఆకాంక్షను నెరవేరుస్తూ రాష్ట్రంలో కులగణనకు కేబినెట్‌లో తీర్మానాన్ని ఆమోదిస్తూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని బీసీ నేతలు కొనియాడారు. రాష్ట్రంలో కులగణన చేయాలని శుక్రవారం ఏపీ క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించడాన్ని స్వాగతిస్తూ శనివారం బీసీ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో బాలాజీ కాలనీలోని జ్యోతిరావ్ పూలే విగ్రహం వద్ద ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దీనికి ముందు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, కోర్ కమిటీ సభ్యుడు బుసగాని లక్ష్మయ్య, సాకం ప్రభాకర్, బీవీ.కేశవులు మాట్లాడుతూ బీసీలందరికీ సమన్యాయంతోపాటు జనాభా నిష్పత్తి ప్రకారం సంక్షేమ ఫలాలు అందరికీ అందాలనే ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం బీసీల అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తూ అనేక సాహసోపేత నిర్ణయాలతో పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి యావత్ బీసీలు రుణపడి ఉంటారన్నారు. తెలుగు భాష అధికార ప్రతినిధి డాక్టర్ మస్తానమ్మ, బీసీ నాయకులు కట్టమంచి చంద్రబాబు యాదవ్, రమణ, రామ య్య ఆచారి, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్, అరుణ్ యాదవ్, గౌడ్ సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి, రజక సంఘ నేత దాము, ఉమాపతి చారి, బుజ్జిబాబు, నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రామనారాయణ, మొదలియార్ పార్థసారథి, మోహన రవి యాదవ్, గాండ్ల సంఘం నేత గుణశేఖర్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.